

నేరస్తులకు శిక్ష పడేలా విచారణ

నేరపూరిత కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఎస్పీ అజిత ఆదేశించారు. శనివారం జిల్లా స్థాయిలో నేర సమీక్ష నిర్వహించారు.

-8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,21,310
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.10,945
3 శాతం జీఎస్టీతో	రూ.11,273
నవర (8 గ్రా)	రూ.90,184

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.3 /27.2

జిల్లాలో ఆదివారం వాతావరణం ఉరుములు, మెరుపులతో పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. శనివారం గాలిలో తేమ 55 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి పార్టీ రిజిస్ట్రేషన్ రద్దు?

నెల్లూరురూరల్: ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి పార్టీ వార్షిక ఆడిట్, ఎన్నికల ఖర్చుల వివరాలను నిర్దేశిత కాల వ్యవధిలో సమర్పించకపోవడంతో ఆ పార్టీ రిజిస్ట్రేషన్ రద్దుపై ఎన్నికల కమిషన్ పరిశీలన చేస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 7లోపు వివరణ ఇవ్వడానికి, అక్టోబర్ 14న వ్యక్తిగత విచారణకు హాజరు కావడానికి కమిషన్ పార్టీకి నోటీసు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. శాసనసభ సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ పూర్తయిన 75 రోజుల్లోపు, ప్రజాసభ సార్వత్రిక ఎన్నికలు పూర్తయిన 90 రోజుల్లోపు కమిషన్ ప్రొఫార్మా ప్రకారం నివేదిక సమర్పించాలి. అయితే ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి పార్టీ పోటీ చేసినప్పటికీ నిర్దేశిత గడువులోపు వివరాలను సమర్పించలేదని కలెక్టర్ తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు



తిరుమల: తిరుమలలో శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు అన్నీ భక్తులతో నిండాయి. క్యూలైన్ గోగర్భం వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 73,581 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 28,976 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.60 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారికి 18 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారికి 3 గంటల్లో స్వామి దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

'ది టానిక్' పేరుపై అభ్యంతరం

సాక్షి టాస్క్‌ఫోర్స్: నగరంలో ఏర్పాటు చేసిన లిక్కర్ స్టోర్‌కు పెట్టిన 'ది టానిక్' పేరు వివాదాస్పదంగా మారింది. నెల్లూరు నగరానికి చెందిన టీడీపీ నాయకుడు దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి అన్నమయ్య సర్కిల్ సమీపంలో 'ది టానిక్' పేరుతో లిక్కర్ స్టోర్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటికే టానిక్ పేరుపై మూడు రాష్ట్రాల్లో స్టోర్స్ ఉన్నాయి. ఆ పేరు ట్రేడ్ మార్కెట్‌లో సైతం నమోదై ఉంది. దీంతో సదరు సంస్థ ప్రతినిధులు తమ బ్రాండ్ పేరు అర్థం వచ్చేలా నెల్లూరులో లిక్కర్ స్టోర్‌కు 'ది టానిక్' పేరు పెట్టారంటూ హైకోర్టులో కేసు వేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు నెల్లూరులోని 'ది టానిక్' బోర్డులు, ఫ్లెక్సీలు తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో నిర్వాహకులు బోర్డులను తొలగించారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన



మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరురూరల్: ప్రతి గ్రామ పంచాయతీలో చాంపియన్ ఫార్మర్ (వ్యవసాయ విజేత) ఎంపిక చేసి, వ్యవసాయంలో నూతన విధానాల అమలు ద్వారా లాభసాటిగా తయారు చేసేందుకు ప్రణాళిక రచిస్తున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో వ్యవసాయ యాంత్రీకరణపై జరిగిన వర్క్‌షాప్ లో కలెక్టర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత జిల్లాలో వ్యవసాయాన్ని రైతులకు లాభసాటిగా తయారు చేసేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరమన్నారు. వ్యవసాయంలో వినూత్న విధానాలను ప్రయోగాత్మకంగా అమలు చేసి చూపిస్తేనే ఫలితాలు వస్తాయన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి ఔత్సాహిక రైతులను ఎంపిక చేసి వారిని వ్యవసాయ విజేతలుగా తీర్చిదిద్దుతామన్నారు. పంట దిగుబడిలో పురోగతి, ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు, సాగు నీటి నిర్వహణలో నైపుణ్యం, ఎరువులు, పురుగుమందుల నిర్వహణ పద్ధతులు, సాగులో వ్యవసాయ యంత్ర వినియోగం, పోస్ట్ హార్వెస్ట్ టెక్నిక్‌లను ఉపయోగించడం, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించడం, సేంద్రియ వ్యవసాయాన్ని ఆచరించడం తదితర నైపుణ్యాలను అందిపుచ్చుకునే విధంగా తయారు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవతి, జిల్లా మత్స్య శాఖ అధికారి శాంతి, జిల్లా ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వైద్యం దైవాదీనం

పెద్దాస్పత్రిలో నిత్యం రోగులకు నరకం

జిల్లాకే తలమానికమైన పెద్దాస్పత్రి రోగులకు నిత్యం నరకం చూపిస్తోంది. ఫుల్ టైమ్‌గా నెలకు రూ.లక్షల్లో జీతాలు తీసుకునే ఆయా వైద్య విభాగాల ప్రొఫెసర్ల నుంచి వైద్యుల వరకు పార్ట్ టైమ్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కొన్ని విభాగాల్లో తగినంత స్టాఫ్ ఉన్నప్పటికీ ఒకరిద్దరు మాత్రమే విధుల్లో ఉండేలా డ్యూటీలను పంచుకుంటూ వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దాదాపు అన్ని విభాగాల వైద్యులు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు థంబ్ వేసి.. ప్రైవేట్ సేవల్లో తరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రౌతు మెత్తన అయితే.. గుర్రం మూడు కాళ్ల మీద పరుగులు తీస్తుందనే ఆర్యోక్తి చందానా పరిస్థితి ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆస్పత్రి సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ మెతక వైఖరితో ఈ పరిస్థితిలో మార్పు రావడం లేదనే ఆక్షేపణలు లేకపోలేదు.



ఓపీ వద్ద క్యూలో ఉన్న రోగులు

- 17 మంది స్టాఫ్ ఉన్నా.. ఎక్స్‌రే కావాలంటే రెండు రోజులు ఆగాల్సిందే
- స్కానింగ్ పరీక్ష రాసిచ్చినా.. అపాయింట్‌మెంట్ తీసుకోవాలంట
- రక్తపరీక్షల రిపోర్టులు మధ్యాహ్నం 2 గంటల తర్వాతే ఇస్తారు
- ఆ లోగా డాక్టర్లు జంప్
- మరునటి రోజు రావాలంటూ నిర్లక్ష్య సమాధానం

నెల్లూరు (అర్బన్): పేదల వైద్యానికి దిక్కైన పెద్దాస్పత్రిలో వైద్యం దైవాదీనంగా మారింది. పెద్దాస్పత్రి నిర్వహణకు నెలకు రూ.కోట్లల్లో ఖర్చు చేస్తున్నా.. ఏ మాత్రం ఉపయోగపడడం లేదు. పెద్దాస్పత్రిలో సోమ, మంగళ, బుధవారాల్లో రద్దీగా ఉంటుంది. మిగతా రోజుల్లో ఓపీ తక్కువగా ఉంటుంది. అయితే రద్దీగా ఉండే రోజుల్లో ఎక్స్‌రే వద్ద రోగులకు బాగా ఆలస్యం జరుగుతోంది. ఎక్స్‌రే విభాగంలో మొత్తం 17 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో కొంత మంది డ్యూటీకి వచ్చి అందుబాటులో ఉండటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇద్దరు ఉద్యోగులు వస్తే ఒకరు థంబ్ (హాజరు) వేసి వెళ్లిపోతారు. మరో రోజు ముందు రోజు గైర్హాజరైన వ్యక్తి రెండో రోజు డ్యూటీ చేస్తాడు. ఇలా ఇద్దరి డ్యూటీని ఒకరు సర్దుబాటు చేసుకోవడం వలేలఎక్స్‌రే వద్ద సేవలు అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

రక్త పరీక్షలది మరీ దారుణం

రక్త పరీక్షలు మొదటి అంతస్తులో చేస్తారు. లిఫ్ట్ ఒక రోజు పని చేస్తే మరో రోజు పని చేయదు. దీంతో వృద్ధులు రక్తపరీక్షలు చేయించుకునేందుకు మెట్లు ఎక్కలేక పరీక్షలు చేయించుకోకుండానే 25 శాతం మంది వెనుదిరుగుతున్నారు.

జిల్లాకే తలమానికం.. వైద్యం గగనం

జిల్లాకే తలమానికమైన పెద్దాస్పత్రిలో స్పెషలిస్టు డాక్టర్లున్నారు. జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, న్యూరో ఫిజిషియన్, న్యూరోసర్జరీ, యురాలజీ, కేన్సర్, దంత, నేత్ర, పల్మనాలజీ, గైనకాలజీ, మానసిక, పిల్లల విభాగం, చర్మవిభాగం, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ ఇలా పలు విభాగాలున్నాయి. ఆయా విభాగాల్లో స్పెషలిస్టు డాక్టర్లున్నారు. సీటీ, ఎంఆర్‌ఐ వంటి అధునాతన పరీక్షలు నిర్వహించే యూనిట్లు ఉన్నా.. అనుభవజ్ఞులైన డాక్టర్లందరూ ఉన్నా వైద్య సేవలు గగనంగా మారాయి. ఫుల్ టైమ్ విధులు నిర్వర్తించాల్సిన సీనియర్ డాక్టర్లు సక్రమంగా ఉండడం లేదు. గంటో.. రెండు గంటలో ఓపీలో కూర్చొంటారు. వచ్చిన రోగులకు పరీక్షలు రాస్తారు. రిపోర్టులు వచ్చే లోపు వెళ్లిపోతున్నారు. జూనియర్ డాక్టర్లు తమకు తెలిసిన మేరకు మందులు రాసిస్తున్న పరిస్థితి ఉంది. దీంతో రోగులకు నాణ్యమైన వైద్యం అందడం లేదు.



స్కానింగ్, ఎక్స్‌రే వద్ద గుమికూడిన రోగులు

850 పడకల ఆస్పత్రి.. సేవల్లో అధోగతి

పెద్దాస్పత్రిని 750 పడకల ఆస్పత్రిగా నిర్మించారు. తాజాగా క్రిటికల్ కేర్ యూనిట్‌ను నిర్మించారు. దీంతో మరో 100 పడకలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం 850 పడకల ఆస్పత్రిగా మారింది. ప్రతి రోజు ఓపీ సంఖ్య 1200 నుంచి 1400 వరకు ఉంటుంది. 500 మంది వరకు ఇన్ పేషెంట్లుగా ఉంటున్నారు. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ ప్రకారం ఓపీ, ఐపీ సంఖ్య మరో 25 శాతం వరకు పెరగాల్సి ఉంది. ఆపరేషన్లు సంఖ్య పెరగాల్సి ఉంది. అలా పెరగక పోవడానికి కారణం రోగులకు సకాలంలో వైద్య పరీక్షలు జరగకపోవడం, పరీక్షలు వచ్చేసరికి డాక్టర్లు అందుబాటులో ఉండకపోవడం ప్రధాన కారణంగా రోగులు పేర్కొంటున్నారు.

పరీక్షలు ఆలస్యం కాకుండా చర్యలు

స్కానింగ్, ఎక్స్‌రే, రక్తపరీక్షలు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకున్నాం. అందుకు సంబంధించి రౌండ్స్ వేసి చెక్ చేస్తున్నాం. ఇటీవల ఎక్స్‌రే వద్ద ఉండాల్సిన సిబ్బంది పూర్తి స్థాయిలో ఉండకపోవడం గమనించి పరిస్థితిని చక్కదిద్దాం. ఇప్పుడు కొత్తగా బాధ్యతలు చేపట్టిన సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో పరిస్థితులు సరిచేశాం.

– డాక్టర్ సుశీల్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి, పెద్దాస్పత్రి

బుజబుజనెల్లూరు చెందిన హబీబా గత వారంలో గైనకాలజీ విభాగంలో వైద్యం కోసం వచ్చారు. డాక్టర్ చెక్ చేసి స్కానింగ్ పరీక్ష రాశారు. స్కానింగ్ వద్దకు వెళ్తే ఆ రోజుకు పేర్లు ఎక్కువగా ఉన్నాయి.. రెండు రోజుల తర్వాత అపాయింట్‌మెంట్ ఇస్తాం.. ఆ రోజు వచ్చి పరీక్ష చేయించుకోమని సమాధానమిచ్చారు. హబీబా ఎంత బతిమాలిడినా సిబ్బంది ఒప్పుకోలేదు. ఒక్కరే డాక్టర్ ఉన్నారు. సాధ్యం కాదని తేల్చి చెప్పడంతో ఆమె ఉసూరుమంటూ ఇంటికి వెళ్లిపోయారు. వాస్తవానికి రేడియాలజీ డిపార్ట్‌మెంట్‌లో స్టాఫ్ ఫుల్‌గా ఉంది. ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, మరో ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మరొక సీనియర్ రెసిడెంట్ డాక్టర్ ఉన్నారు. అయినా ఆ రోజు అందరూ లేరని, ఒక్కరే ఉన్నారంటే.. డ్యూటీకి వచ్చి థంబ్ వేసి సొంత, ప్రైవేట్ ప్రాక్టీస్‌కు వెళ్లిపోయి ఉంటారని ఆరోపణలు వినిస్తున్నాయి. ఈ విభాగాన్ని పర్యవేక్షించాల్సిన రేడియాలజి ప్రొఫెసర్ హెచ్ఓడీ రూమ్‌కు పరిమితం కావడంతో ఈ దుస్థితి ఏర్పడిందనే విమర్శలు లేకపోలేదు.

9వ తేదీ స్కానింగ్‌కు రమ్మన్నారు

– సుబ్బమ్మ, వెంకటరెడ్డిపల్లి, కలువాయి మండలం



నేను వయోభారంతో ఉన్నాను. ఆరోగ్యం బాగ లేక శనివారం మరో ఇద్దరిని తోడు తీసుకుని పెద్దాస్పత్రికి వచ్చాను. డాక్టరమ్మ రక్తపరీక్షలతో పాటు పెల్విస్‌కి స్కానింగ్ రాశారు. అయితే స్కానింగ్ వారు ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకోవాలన్నారు. నాకు 9వ తేదీ స్కాన్ చేస్తామని చీటీ మీద రాసిచ్చారు. ముందే నొప్పితో బాధపడుతున్నాను. రిపోర్టును చూసి ఆపరేషన్ చేస్తామని గైనకాలజీ విభాగం డాక్టర్ చెప్పారు. తీరా స్కానింగ్ వద్దకు వస్తే ఐదో రోజులు ఆగి రమ్మని చెప్పడం దారుణం. మా ఊరు నుంచి నెల్లూరుకు వచ్చేదానికి, పోయేదానికి ముగ్గురికి చార్జీలు రూ.600 అయ్యాయి. పైఖర్చులు మరో రూ.200 అయ్యాయి. మళ్లీ ఇంకో రోజు రావాలంటే ఇలాగే ఖర్చులు అవుతాయి. నాలాంటి వాళ్లకు ఇంత స్థాయిలో ఖర్చులు పెట్టుకోవడం, తిరగడం సాధ్యమేనా?. నా పరిస్థితిని, నా వయస్సును పరిగణలోకి తీసుకోవాలి కదా?.

అవినీతి తప్ప.. అభివృద్ధి ఎక్కడ?

- గ్రావెల్‌తో రూ.100 కోట్ల కొల్లగొట్టిన సోమిరెడ్డి
- కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజం



ముదిగేడులో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలో అవినీతి తప్ప.. అభివృద్ధి బూతద్దంతో వెతికినా కనిపించడం లేదని, తండ్రీకొడుకులు కలిసి అన్ని వనరులను దోచుకుంటున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. పొదలకూరు మండలం దుగ్గుంటరాజుపాళెం, ముదిగేడు, ఇనుకుర్తి గ్రామాల్లో కాకాణి శనివారం పర్యటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఆయా గ్రామాల్లో ఏమైనా అభివృద్ధి పనులు జరుగుతున్నాయా? అని ఆరా తీశారు. సహజ వనరుల దోపిడీ తప్ప, అభివృద్ధి కానరావడం లేదని స్థానికులు స్పష్టం చేశారు. కాకాణి మాట్లాడుతూ సోమిరెడ్డి, ఆయన కుమారుడు ఈ పదహారు నెలల్లోనే రూ.100 కోట్లు గ్రావెల్ కొల్లగొట్టేశారని ఆరోపించారు. ఇక ఇసుకలో అయితే లెక్కేలేదన్నారు. వీరిద్దరి అక్రమార్జనతో పొదలకూరు మండలం విరువూరు, సూరాయపాళెం గ్రామాల ఇసుక రీచ్‌ల చుట్టు పక్కల గ్రామాల వారు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. నేలటూరు జెన్‌కో ప్లాంట్ నుంచి ఫ్లైయాష్ అక్రమ తరలింపులో తన వాటా పెంచాలని డిమాండ్ చేస్తూ సోమిరెడ్డి ఏకంగా జెన్‌కోపై దాడికి తన మనుషులను పంపించారి విమర్శించారు. పొదలకూరులో లేఅవుట్ల యజమానులను బెదిరించి రూ.కోట్లల్లో డబ్బులు దండుకున్నారని, అంగన్‌వాడీ పోస్టులను అర్హత లేని వారికి అమ్ముకున్నారని ఆరోపించారు. మద్యం దుకాణాలు, బెల్టు షాపులకు సోమిరెడ్డి రేట్లు నిర్ణయించి మామూళ్లు వసూలు చేస్తున్నారన్నారు. సోమిరెడ్డి ముఠా వెంకటాచలం మండలంలో 10 ఎకరాల ప్రభుత్వ భూమి కాజేసేందుకు పెద్ద స్కెచ్ వేశారన్నారు. సర్వేపల్లి నియోజకవర్గాన్ని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చేశారని దుయ్యబట్టారు. పామాయిల్ ట్యాంకర్ల దోపిడీ, ప్రైవేట్ పొలాల్లో చెట్లను నరికివేయడం వంటి పనులకు పాల్పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వ ఆగడాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు డిజిటల్ బుక్‌లో నమోదు చేయాల్సిందిగా సూచించారు. పార్టీ నాయకులతో అనుచితంగా వ్యవహరించే వారిని ఎవరినీ వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. దుగ్గుంటరాజుపాళెంలో నూతన గృహప్రవేశం చేసిన మందారపు మోహన్ దంపతులను ఆశీర్వదించిన కాకాణి ఇనుకుర్తిలో శస్త్రచికిత్స చేయించుకున్న ముడి మస్తానయ్యను, భార్యా వియోగానికి గురైన ముదిగేడుకు చెందిన మాలపాటి ఓబుల్‌రెడ్డి, సంగాపు సుబ్బయ్యలను పరామర్శించారు. కార్యక్రమంలో బచ్చల సురేషకుమార్‌రెడ్డి, ఎం.వెంకటశేషయ్య, పెదమల్లు రమణారెడ్డి, కేతు రామిరెడ్డి, కోనం బ్రహ్మయ్య, ఎం.సుందరయ్య, ఎం.జనార్దన్, మండి శంకర్‌రెడ్డి, నోటి వెంకటేశ్వర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం

- ఆర్‌అండ్‌బీ ఎస్ఈకి వినతిపత్రం



ఆర్‌అండ్‌బీ ఎస్ఈ గంగాధరాన్ని కలిసి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నెల్లూరు (అర్బన్): రోడ్లు, భవనాల శాఖ సర్కిల్ పరిధిలోని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమించక తప్పదని ఆ శాఖ ఉద్యోగులు, ఏపీ ఇరిగేషన్, రోడ్స్ అండ్ బిల్డింగ్స్, పబ్లిక్ హెల్త్, పంచాయతీరాజ్, మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్, అమరావతి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈవీఎం శరత్‌బాబు స్పష్టం చేశారు. శనివారం నగరంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో ఎస్ఈ గంగాధరంను కలిసి వినతి పత్రం అందజేశారు. శరత్‌బాబు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరిస్తామని గత ఏప్రిల్‌లోనే రాత పూర్వకంగా అధికారులు హామీ ఇచ్చినప్పటికీ నేటికి పరిష్కారానికి నోచుకోలేదన్నారు. తిరుపతి జిల్లాకు బదిలీ చేసిన 17 మందిని తక్షణమే జిల్లాకు తీసుకురావాలన్నారు. అందులో దివ్యాంగురాలైన మహిళను తిరుపతి జిల్లాకు పంపడం బాధాకరమన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి పొంది గ్రేడ్ 1, గ్రేడ్ 2 ఉద్యోగులు నాలుగు నెలలు విధులు నిర్వర్తించాక రివర్షన్ పొందిన ఉద్యోగులు పనిచేసిన కాలానికి వేతనాలు ఇవ్వాలని, వారి పదోన్నతులు కొనసాగించాలని కోరారు. సీనియార్టీ ప్రకారం పెండింగ్‌లో ఉన్న టెక్నికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఉద్యోగులకు జేటీఓలుగా పదోన్నతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మస్తానయ్య, నారాయణ, సురేష్, నాగేశ్వరరావు, షబ్బీర్ అహ్మద్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

పెన్నాకు వరద నీటి విడుదల నిలిపివేత

సోమశిల: జలాశయం నుంచి పెన్నానదికి క్రస్ట్‌గేట్ల నుంచి విడుదల చేస్తున్న వరద జలాలను నిలిపివేసినట్లు ఈఈ శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో నీటి విడుదల నిలివేశామన్నారు. జలాశయానికి 12,036 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. పవర్‌టన్నెల్‌కు 2,650, ఉత్తర కాలువకు 100, కండలేరుకు 4,000 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

టాలెంట్ టెస్టులు నిర్వహిస్తే చర్యలు

నెల్లూరు (అర్బన్): హైకోర్టు ఆదేశాలను అనుసరించి జిల్లాలోని అన్ని ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో ఎలాంటి టాలెంట్ టెస్టులు నిర్వహించకూడదని సంబంధిత పాఠశాలల కరస్పాండెంట్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీఈఓ బాలాజీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా నిబంధనలకు వ్యతిరేకంగా పోటీ పరీక్షలు నిర్వహిస్తే ఆయా పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొనసాగుతున్న డాక్టర్ల సమ్మె




జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న డాక్టర్లు

నెల్లూరు (అర్బన్): పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న ప్రభుత్వ వైద్యుల సమ్మె శనివారం ఐదో రోజూ కొనసాగింది. తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు సమ్మె ఆపేది లేదని ప్రభుత్వ డాక్టర్ల సంఘం నేత డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు స్పష్టం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని 52 పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న డాక్టర్లు ఓపీ సేవలను బహిష్కరించారు. జిల్లాకు చెందిన ఎక్కువ మంది డాక్టర్లు విజయవాడలో జరిగే ఆందోళనలో పాల్గొనేదానికి వెళ్లారు. మరికొంత మంది డాక్టర్లు స్థానిక సంతపేటలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖా కార్యాలయం ముందు ధర్నా చేశారు. డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు మాట్లాడుతూ గత సంవత్సరం తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మెకు పోగా ప్రభుత్వం కొంత గడువు కావాలని , ఈ లోపు సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అయితే ఆ హామీని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే ఇప్పుడు సమ్మె బాట పట్టామన్నారు. పీహెచ్‌సీల్లో 20 నుంచి 25 ఏళ్లుగా ఒకే కేడర్‌లో ఎలాంటి ప్రమోషన్లు లేకుండా డాక్టర్లు పని చేయడం బాధాకరమన్నారు. తక్షణమే నిర్దిష్ట కాలపరిమితితో ప్రమోషన్లు కల్పించాలన్నారు. ఇన్ సర్వీసు పీజీ కోటాను పునరుద్ధరించేందుకు జీఓ నంబర్ 99ను రద్దు చేయాలన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. ఎలాంటి సౌకర్యాలు లేని అటవీ, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న డాక్టర్లకు 50 శాతం మూలవేతనాన్ని గిరిజన భత్యంగా మంజూరు చేయాలన్నారు. సంచార చికిత్స కార్యక్రమానికి రూ.5 వేలు భత్యం ఇవ్వాలన్నారు. డాక్టర్లు సమ్మెలో ఉండడంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నవీన్‌కుమార్‌రెడ్డి, శ్రావణి, జ్యోతిరాణి, విజయలక్ష్మి, సాయిప్రియాంక, రమ్య, మనోజ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు అండగా ఉంటాం

నెల్లూరు సిటీ: ఆటో డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు సాయం పథకాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. లక్ష్మీపురంలోని ఎస్‌బీఎస్ కల్యాణ మండపంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో శనివారం ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 17,406 మంది డ్రైవర్లకు రూ.26.1 కోట్లు నేరుగా వారి ఖాతాలో జమ చేశామన్నారు. ఎవరికైనా పథకం అందకపోతే సచివాలయాల్లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయడంతోపాటు హెల్ప్‌లైన్ కూడా అందుబాటులో ఉంచామన్నారు. తొలుత నగరంలోని మినీబైపాస్ రోడ్డులోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నుంచి స్టోన్‌హౌస్‌పేట వరకు ర్యాలీ నిర్వహించారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆటోడ్రైవర్ల నుంచి స్పందన కరువైంది. వీరి కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు చాలా వరకు ఖాళీగా కనిపించాయి. ఆటోడ్రైవర్లు అరకొరగా కనిపిస్తే.. టీడీపీకి చెందిన మహిళలతో కల్యాణ మండపాన్ని నింపేయడం విస్మయాన్ని కలిగించింది. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ నందన్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ చందర్, టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నమూనా చెక్కు అందజేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లా

విద్యాశాఖలో అంతర్‌జిల్లాల బదిలీలు

నెల్లూరు(అర్బన్): ఉపాధ్యాయుల అంతర్ జిల్లాల బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దరఖాస్తు చేసుకున్న వారిలో ఇతర జిల్లాల నుంచి 16 మంది ఎస్‌జీటీలు, ఐదుగురు స్కూల్ అసిస్టెంట్లు కలిపి 21 మంది జిల్లాకు బదిలీ అయ్యారు. జిల్లాలో పనిచేస్తున్న 15 మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయులు, 8 మంది స్కూల్ అసిస్టెంట్లు కలిపి 21 మంది ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు.


వేలిముద్ర వేస్తూ..


పడిగాపులు కాస్తున్న మహిళలు


ఇంకా ఎంతసేపు నిరీక్షించాలో..?


అష్టకష్టాలు పడుతూ వస్తున్న వృద్ధుడు

ఏమిటయ్యా ఈ పరేషాన్..?

ఎండీయూ వాహనాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో రేషన్ సరుకులను పొందడంలో వృద్ధులకు కష్టాలు ఎదురవుతున్నాయి. దూరంలోని షాపులకెళ్లి సరుకులను తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది. అక్కడ పడిగాపులు కాయలేక పండుటాకుల కష్టాలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. నెల్లూరులోని జేమ్స్‌గార్డెన్‌లో గల చౌక దుకాణం వద్ద ఈ పరిస్థితులు కనిపించాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.138
లేయర్	రూ.117
బ్రాయిలర్ చికెన్:	రూ.246
స్కిన్‌లెస్ చికెన్:	రూ.270
లేయర్ చికెన్:	రూ.200

క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో షాపు దగ్ధం

• రూ.ఐదు లక్షల నష్టం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: షార్ట్ సర్క్యూట్‌తో షాపు దగ్ధమైన ఘటన మండలంలోని మిన గల్లు బీసీ కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల వివరాల మేరకు.. బీసీ కాలనీలో నివాసం ఉంటున్న రామయ్య, లక్ష్మమ్మ దంపతులు మెషీన్‌తో కర్పూరాన్ని తయారు చేసి వాటిని విక్రయించడం ద్వారా జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో షాపులో అర్ధరాత్రి వేళ మంటలు వ్యాపించడాన్ని గమనించిన చుట్టుపక్కల వారు విషయాన్ని బాధితులకు తెలియజేశారు. అక్కడికెళ్లేలోపు మెషీన్‌తో పాటు గది మొత్తం పూర్తిగా కాలిపోయింది. రూ.ఐదు లక్షల నష్టం సంభవించిందని బాధితులు తెలిపారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేక కాలువలో దూకి..

కలువాయి(సైదాపురం): తెలుగుగంగ కాలువలో దూకి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని పర్లకొండ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. చింతలాత్మకూరుకు చెందిన నాగిళ్ల రవి (30) తెలుగు గంగ కాలువలో దూకారు. దాచూరు సమీపంలోని కండలేరులో మృతదేహాన్ని స్థానికులు శనివారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటన స్థలానికి ఎస్సై కోటయ్య చేరుకొని విచారణ చేపట్టారు. నాగిళ్ల రవికి మతిస్థిమితం సక్రమంగా లేదని తల్లిదండ్రులు తెలిపారని పోలీసులు చెప్పారు.

చిన్నారిని అక్కున చేర్చుకొని..



నెల్లూరు(పొగతోట): నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఎనిమిదేళ్ల బాలుడ్ని గుర్తుతెలియని వ్యక్తులు శనివారం వదిలి వెళ్లిపోయారు. విషయాన్ని తెలుసుకున్న ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, బాలల సంరక్షణాధికారి సురేష్ అక్కున చేర్చుకున్నారు. చిల్డ్రన్స్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు కాప్ చిల్డ్రన్స్ హోమ్‌లో చేర్పించారు. పూర్తి వివరాలను సేకరించేందుకు చర్యలు చేపడుతున్నారు. తల్లిదండ్రుల ఆచూకీ తెలిస్తే అప్పగిస్తామని, వివరాలు తెలిసిన వారు 90007 89793 నంబర్‌ను సంప్రదించాలని అధికారులు కోరారు.

కండలేరులో నీటి నిల్వ

రాపూరు: కండలేరులో శనివారం నాటికి 58.23 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల నుంచి కండలేరుకు 3600 క్యూసెక్కుల నీరు చేరుతోందని వివరించారు. కండలేరు నుంచి సత్యసాయిగంగకు 430, పిన్నేరుకు 140, లోలెవల్‌కు 40, హైలెవల్‌కు 30, మొదటి బ్రాంచ్ కాలువలకు ఐదు క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని చెప్పారు.

పొదలకూరు నిమ్మ ధరలు



పెద్దవి: రూ.40
సన్నవి: రూ.25
పండ్లు: రూ.15

ఆత్మహత్య కాదు.. హత్యే


మృతుడి బంధువులతో మాట్లాడుతున్న ఎస్సై

• మృతుడి బంధువుల ఆరోపణ
• అంత్యక్రియలను అడ్డుకున్న వైనం

కొండాపురం: మండలంలోని సాయిపేట బీసీ కాలనీలో బండారు సుధాకర్ (51) ఉరేసుకొని గురువారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డారని కొండాపురం పోలీసులు శుక్రవారం తెలిపారు. అయితే ఇది హత్యేనని ఆరోపిస్తూ గ్రామంలో శనివారం జరగాల్సిన అంత్యక్రియలను మృతుడి బంధువులు అడ్డుకున్నారు. మృతుడి సోదరులు, బంధువులు బండారు ప్రసాద్, రమేష్, శ్రీనివాసులు, కొండయ్య, మల్లె చిన్నయ్య, మరి కొందరు గ్రామంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో సానంగుల రవితో సుధాకర్ భార్య మల్లేశ్వరికి వివాహేతర సంబంధం ఉందని, ఈ క్రమంలో ఆమె అన్న తురకా మాధవ, సునీత, లక్ష్మీకాంతమ్మ, వేణు మరికొందరితో కలిసి సుధాకర్‌పై దాడి చేసి ఉరేసి చంపారని ఆరోపించారు. కొంత మంది అధికార పార్టీ నేతల ఒత్తిడితో ఆత్మహత్యగా పోలీసులు చిత్రీకరించారని చెప్పారు. రామాలయం వద్ద సుధాకర్‌పై మల్లేశ్వరి బంధువులు దాడి చేస్తుంటే గ్రామం మొత్తం చూశారని, అదే రోజు రాత్రి హత మార్చారని ఆరోపించారు. వీరిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న కొండాపురం ఎస్సై మాల్యాద్రి.. గ్రామానికి చేరుకొని నచ్చజెప్పేందుకు యత్నించారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

రైలు కిందపడి వ్యక్తి బలవన్మరణం

నెల్లూరు(క్రైమ్): రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు సమీపంలోని పట్టాలపై చోటుచేసుకుంది. మృతుడు సుమారు 40 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు కలిగి.. తెలుపు రంగు హాఫ్ హ్యాండ్స్ చొక్కా, నలుపు రంగు షార్ట్‌ను ధరించి ఉన్నారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాల కోసం కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు సమీపంలో ఆరాతీస్తున్నారు.

రైల్లోంచి జారిపడి..



కొడవలూరు: రైల్లోంచి జారిపడటంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని తలమంచి రైల్వేస్టేషన్ వద్ద శనివారం చోటుచేసుకుంది. రైల్వే హెచ్‌సీ వెంకటేశ్వర రావు వివరాల మేరకు.. తలమంచి రైల్వేస్టేషన్ వద్ద గల 190 – 25ఏ – 27 పోస్టుల మధ్య ఎగువ లైన్‌లో రైల్లోంచి జారిపడటంతో విజయవాడకు చెందిన కందుకూరి రమేష్ (30) మృతి చెందారు. మృతుడు రెండు చొక్కాలు, రెండు ప్యాంట్లను ధరించి ఉన్నారు. రైల్లో యాచించే వ్యక్తిగా భావిస్తున్నారు. మృతుడి వద్ద ఆధార్ కార్డు లభించిందన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మకూరులో అనుమానాస్పద మృతి..?

ఆత్మకూరు రూరల్: పట్టణంలోని బీఎస్సార్ సెంటర్ సమీపంలో ఐదు రోజుల క్రితం జరిగిన ఘటన అనుమానాస్పద మృతి అనే ప్రచారం జరుగుతోంది. ఈద్గా ఆవరణలో చోటుచేసుకున్న ఈ ఘటనను ప్రముఖులు, ఇతరుల ఒత్తిడితో సాధారణ మరణంగా పోలీసులు చిత్రీకరిస్తున్నారనే చర్చ సాగుతోంది. మృతుడి కుటుంబసభ్యులు సైతం సాధారణ మరణంగానే పోలీసులకు వాంగ్మూలమిచ్చార ని తెలుస్తోంది. కాగా ఈ విషయమై ఆత్మకూరు సీఐ గంగాధర్‌ను సంప్రదించగా, అన్ని కోణాల్లో విచారించి దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలను తెలియజేస్తామని వెల్లడించారు.

బాధ్యతాయుతంగా సబ్‌స్టేషన్ల నిర్వహణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సబ్‌స్టేషన్లను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) గురవయ్య ఆదేశించారు. నగరంలోని 33 / 11 కేవీ వైఎమ్మీఏ సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా శనివారం తనిఖీ చేశారు. సాంకేతిక విధి విధానాలు, రికార్డుల నిర్వహణ, ఫీడర్లలో లోడ్ తదితరాలను పర్యవేక్షించారు. ఎల్సీ, లాగ్‌బుక్, ఫీడర్ రీడింగ్ రిజిస్టర్లను తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రికార్డులను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. నోడల్ ఆఫీసర్ శేషాద్రిబాలచంద్ర, ఈఈ లక్ష్మీనారాయణ, డీఈఈలు కిరణ్, సుప్రియ, ఏఈలు లక్ష్మీబాయి, లక్ష్మి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న గురవయ్య

బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం


రక్తపు మడుగులో సుబ్బారెడ్డి

సోమశిల: బైక్ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన అనంతసాగరం మండల పరిధిలోని మినగల్లు సమీపంలో గల ప్రధాన రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని కొత్తపల్లికి చెందిన చిలకా కృష్ణారెడ్డి తన బైక్‌పై ఆత్మకూరువైపు నుంచి వస్తున్నారు. ఇదే సమయంలో కాకూరువారి పల్లికి చెందిన సుబ్బారెడ్డి (65), వెంకటసుబ్బారెడ్డి మినగల్లులో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి వెళ్లి తిరిగి నడుచుకొని బయల్దేరారు. ఈ తరుణంలో మినగల్లు సమీపంలోని సచివాలయం వద్ద బైక్ ఢీకొనడంతో సుబ్బారెడ్డి తలకు బలమైన గాయమైంది. హాస్పిటల్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందారు. వెంకటసుబ్బారెడ్డి స్వల్పంగా గాయపడగా, బైక్‌పై ఉన్న కృష్ణారెడ్డి పరిస్థితి విషమంగా మారడంతో చికిత్స నిమిత్తం ఆత్మకూరు హాస్పిటల్‌కు.. ఆపై మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరులోని వైద్యశాలకు తరలించారు. సుబ్బారెడ్డి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి తెలిపారు.

ట్రాలీ తెచ్చిన తంటా


ఇరుక్కుపోయిన లారీ


స్తంభించిన ట్రాఫిక్

• వంతెనపై ఇరుక్కున్న లారీ
• రెండు కిలోమీటర్ల మేర స్తంభించిన ట్రాఫిక్

దగదర్తి: భారీ లోడుతో వెళ్తున్న ట్రాలీ ఇరుక్కుపోయి ముందుకు కదల్లేకపోవడంతో రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ దాదాపు రెండు గంటల పాటు స్తంభించింది. మండలంలోని అల్లూరు రోడ్డు వద్ద జాతీయ రహదారి రైల్వే వంతెనపై శనివారం జరిగిన ఈ పరిణామంతో వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. వివరాలు.. రైల్వే వంతెనపై రోడ్డు రెండు వరుసలే ఉంటుంది. ఈ క్రమంలో కావలి నుంచి నెల్లూరువైపు భారీ లోడ్‌తో వెళ్తున్న ట్రాలీ రైల్వే వంతెనపైకి రాగానే మధ్యలో ఇరుక్కుపోయి ముందుకు కదల్లేదు. దీంతో వాహనాన్ని డ్రైవర్ నిలిపేయడంతో ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న దగదర్తి పోలీసులు, హైవే మొబైల్ సిబ్బంది.. మార్జిన్ రాళ్లను తొలగించి ట్రాలీ ముందుకెళ్లేలా చర్యలు చేపట్టారు. జాతీయ రహదారి ఆరు వరుసలకు గానూ ఇక్కడ రెండే ఉండటంతో ఈ పరిస్థితి నిత్యకృత్యమవుతోంది.

నేరస్తులకు శిక్ష పడేలా సమగ్ర విచారణ

• ఎస్పీ అజిత



మాట్లాడుతున్న అజిత వేజెండ్ల

నెల్లూరు(క్రైమ్): కేసుల్లో సమగ్ర విచారణ జరిపి నేరస్తులకు శిక్ష పడేలా చేయాలని ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశించారు. నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. స్టేషన్ల వారీగా కేసుల వివరాలను ఆరాతీశారు. పెండింగ్ కేసుల పరిష్కారం, నేర నియంత్రణ చర్యలపై దిశా నిర్దేశం చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. నేరాలను కట్టడి చేసి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలను అందించాలని సూచించారు. మహిళల భద్రత, మత్తు, మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, సింగిల్ నంబర్లాట, పేకాట తదితరాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని, నేరాలకు తరచూ పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. నాన్ బెయిలబుల్ వారెంట్లను ఎగ్జిక్యూట్ చేయాలని, జిల్లాను సీసీ కెమెరాల నిఘా నీడలోకి తీసుకురావాలని ఆదేశించారు. అనుమానిత ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్‌లను నిర్వహించాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని గ్రామాలను ప్రతి ఒక్కరూ తప్పక సందర్శించి, అక్కడి ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని తెలిపారు. కేసుల వివరాలను ఎప్పటికప్పుడు సీసీటీఎన్నెస్‌లో పొందుపర్చడంతో పాటు రాత్రి గస్తీని పెంచి అనుమానితుల వేలిముద్రలను సేకరించాలన్నారు. పోక్సో కేసుల్లో బాధితులకు అందే నష్టపరిహారంపై సఖీ వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది తెలియజేశారు. ఏఎస్పీ సౌజన్య, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.